క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కంభం: పట్టణంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంటు తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే కార్యక్రమం చేపడుతున్నందున విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని విద్యుత్‌శాఖ ఏఈ నర్సయ్య తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు అక్కచెరువులో ఎస్ఎంసీ ఎన్నిక

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని అక్కచెరువు ఏపీ పాఠశాలలో కోరం లేక వాయిదా పడిన ఎస్ఎంసీ ఎన్నికను శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మామిళ్లపల్లి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నిక ప్రక్రియ నిర్వహిస్తామని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓ



ఎంపీడీఓ నరసింహులుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

తర్లుపాడు: మండల పరిషత్ అధికారిగా నరసింహులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆఫీస్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఈఓఆర్డీ బాలకృష్ణ, ప్రసాద్, ఉదయ్, పంచాయతీ సెక్రటరీలు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

వాజ్‌పేయ్‌కు ఘన నివాళి



వాజ్‌పేయ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మార్కాపురం: భారతరత్న, మాజీ ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయ్ వర్ధంతిని శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ నాయకుడు పైడిమర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలపాటు పార్లమెంటు సభ్యునిగా కొనసాగిన వాజ్‌పేయ్.. రాజనీతిజ్ఞుడు, గొప్ప కవి అని కొనియాడారు. భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఆయన మూడుసార్లు ప్రధానిగా దేశానికి విశేష సేవలందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు బొంతల కృష్ణ, కార్యదర్శి మొరిబోయిన చిన్నయ్య, జిల్లా మహిళా మోర్చ ప్రధాన కార్యదర్శి మద్దెల లక్ష్మీదేవి, పట్టణ కార్యదర్శి గోనుగుంట్ల శ్రీధర్, మండల దళిత మోర్చా నాయకులు గుంటి ప్రభాకర్, లెక్చరర్ రామకృష్ణ, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

దర్శి: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 450 మంది విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో జరిగిన కార్యక్రమం రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ పానుగంటి వెంకట కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు మధ్యాహ్న భోజనానికి ఇబ్బందులు లేకుండా ప్లేట్లు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు స్వాతంత్య్ర దినోత్సవ శుభాకాంక్షలు చెప్పారు. సెక్రటరీ బోయెల్ల నాగేశ్వర రెడ్డి, కోశాధికారి అంబవరపు నారాయణరెడ్డి, రోటరీ సభ్యులు అలవల అంజిరెడ్డి, వెన్నపూస పేరిరెడ్డి, రెడ్డిమాసు శ్రీను, మారం శివకోటిరెడ్డి, మిల్లర్ బుజ్జి, కర్నా రమణారెడ్డి, సీహెచ్ రాజారెడ్డి, కంచంరెడ్డి వెంకట్రామిరెడ్డి, కొల్లా ఉదయ్ భాస్కర్, కొత్తమారం సత్యనారాయణరెడ్డి, ఎదురు నారాయణరెడ్డి, పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ శుక్రవార పూజలు



కలువపూల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న రాజ్యలక్ష్మి అమ్మవారు



కొమరోలు: అక్కపల్లెలో వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న మహిళలు

మార్కాపురం: శ్రావణ మాసం వరలక్ష్మి వ్రతం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి మూల విగ్రహమూర్తిని వేయి కలువపూలతో శోభాయమానంగా అలంకరించారు.

పొదిలి: పొదిలమ్మ తల్లి ఆలయం, వెంకటేశ్వర స్వామి ఆలయం, నిర్మమహేశ్వరస్వామి ఆలయం, వేణుగోపాల స్వామి ఆలయం, వాసవి అమ్మవారి ఆలయం, అంకాల పరమేశ్వరి, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

కొనకనమిట్ల: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా శుక్రవారం మహిళలు విశేష పూజలు నిర్వహించారు. ఇళ్లలోనే వరలక్ష్మీదేవి ప్రతిమను ప్రతిష్ఠించి పూజలు చేయడంతోపాటు గోమాతలను పూజించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాయనాలు ఇచ్చిపుచ్చుకున్నారు. గొట్లగట్టు అభయాంజనేయస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం, కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు.

కొమరోలు : మండలంలో 2వ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం కావడంతో మహిళలు భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయాల్లో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కొమరోలులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో, అక్కపల్లె గ్రామంలోని రాములవారి దేవాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బేస్తవారిపేట: స్థానిక దరగ కొండపై త్రిలోక పుణ్యక్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు శుక్రవారం నిర్వహించారు. ఉదయం సామూహిక వరలక్ష్మీవ్రతం, 108 కళశాలతో కుంకుమార్చన పూజలు జరిపించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గొట్లగట్టులో వాయనాలు ఇచ్చిపుచ్చుకుంటున్న మహిళలు



పూజలందుకుంటున్న పొదిలమ్మ అమ్మవారు

అధైర్యపడొద్దు అండగా ఉంటాం



కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా



సౌజన్యను ఆశీర్వదిస్తున్న అన్నా, పార్టీ నాయకులు

- వైఎస్సార్ సీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే అన్నా భరోసా

కొనకనమిట్ల: అధికారంలోకి రాలేదని ఎవరూ అధైర్య పడొద్దని దేవుని దయ ప్రజల ఆశీస్సులతో మళ్లీ మనకు మంచి రోజులొస్తాయని మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని గొట్లగట్టు గ్రామంలో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణయాదవ్, జడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, మండల పార్టీ కన్వీనర్ మోరా శంకర్‌రెడ్డిలతో కలిసి నిర్వహించిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో ఇబ్బందులు పెడుతున్నారని, అయినా ఎవరికీ భయపడేది లేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులు మాదారపు వెంకటనారాయణ, శాంతమ్మ దంపతుల కుమార్తె వెంకట సౌజన్య వివాహ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు. సొసైటీ మాజీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, పార్టీ జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ఉన్నం శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ సభ్యులు గోనుగుంట్ల శ్రీనివాసులు, ఉప్పుటూరి పెదవెంకటయ్య, పార్టీ నాయకులు నాగం ప్రసాద్, పోలసాని నారాయణరెడ్డి, ఉబ్బరపు చినకాశయ్య, పసల చెన్నకేశవులు, మోరబోయిన మాలకొండయ్య, అనుకు ఏడుకొండలు, కె.సుబ్బారావు, తంగిరాల బ్రహ్మారెడ్డి, దొంతిరెడ్డి చినరామిరెడ్డి, గుంటక నారాయణ, కరవర్ల డేవిడ్ పాల్గొన్నారు.

గౌతు లచ్చన్న సేవలు మరువలేనివి



గౌతులచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘ నాయకులు

మార్కాపురం: స్వాతంత్య్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరువలేనివని మార్కాపురం గౌడ సంఘ అధ్యక్షుడు గజ్జ రమణగౌడ్ పేర్కొన్నారు. గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రమణగౌడ్ మాట్లాడుతూ.. శ్రీకాకుళం జిల్లా బారువ గ్రామంలో ఒక సామాన్య కల్లుగీత కార్మికుని కుటుంబంలో జన్మించి భారతదేశ స్వాతంత్య్రం కోసం మహాత్మా గాంధీ, సర్దార్ వల్లభాయ్‌పటేల్, నెహ్రూ, నేతాజీ లాంటి దేశ నాయకులతో కలిసి ఉద్యమాల్లో పాల్గొని ఎన్నోసార్లు జైలు జీవితం గడిపారని గుర్తు చేశారు. నూతన మద్యం పాలసీలో తెలంగాణాలో మాదిరిగా ఏపీలో కూడా గౌడ కుటుంబాలకు రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం సలహాదారులు బత్తిని శ్రీనివాసరావుగౌడ్, గౌరవ అధ్యక్షుడు జూపల్లి హనుమయ్యగౌడ్, గౌరవ సలహాదారులు కొమర వెంకటేశ్వర్లు గౌడ్, గౌడ సంఘ ఉపాధ్యక్షుడు గజ్జ రంగారావు గౌడ్, సహాయ కార్యదర్శి గుండ్ల వెంకటేశ్వర్లు గౌడ్, కొమరా రూపేష్ గౌడ్, బత్తిని సాయి చైతన్య గౌడ్, దొంత రాఘవగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకులపై దాడి అమానుషం



దాడిని ఖండిస్తున్న బీజేపీ నాయకులు

గిద్దలూరు రూరల్: స్థానిక బీజేపీ నాయకులు షేక్ మస్తాన్‌వలి, రాజశేఖర్, పీరయ్యలపై గురువారం రాత్రి టీడీపీ నాయకులు చేసిన దాడి అమానుషమని, ఈ దాడిని ఖండిస్తున్నామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా దాడిలో గాయపడిన వారిని పరామర్శించారు. పార్టీలో చేరిన వ్యక్తులపై టీడీపీ నాయకులు దాడికి పాల్పడటం సరైన పద్ధతి కాదన్నారు. ఈ సదర్భంగా దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానిక సీఐ సురేష్‌ను బీజేపీ నాయకులు కోరారు.



రాష్ట్రీయ రహదారిపై ఏర్పడిన భారీ గుంత

ప్రాణాలతో చెలగాటం

- ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం
- వాహనదారులకు ఇబ్బందులు

కొమరోలు: ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అమరావతి–కడప రాష్ట్రీయ రహదారి కొమరోలు మండలం పొట్టిపల్లె గ్రామం వద్ద భారీ గుంత ఏర్పడింది. దీనిలో ఇప్పటి వరకు ఎంతో మంది వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. నెల రోజుల క్రితం మెయింటేనెన్స్ వర్క్ కింద ఆ భారీ గుంత ఉన్న ప్రదేశంలో ఆర్అండ్‌బీ అధికారులు గ్రావెల్ తోలించి చదును చేయించారు. నెల తిరగక ముందే ఆ గుంతలో పోసిన గ్రావెల్ వర్షం కారణంగా కొట్టుకుపోవడంతో పాటు ఆ గుంత మరింత పెద్దదిగా మారింది. సాఫీగా ఉన్న ఆర్అండ్‌బీ రోడ్డులో అనుకోకుండా పెద్దగుంత ఉండటంతో వేగంగా వెళ్తున్న వాహనాలు గమనించక లోతు గుంతలో దిగడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ రోడ్డుకు మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.



రహదారిపై ఉన్న గుంతలో దిగి ప్రమాదానికి గురైన కారు

వరిలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి

అర్ధవీడు (బేస్తవారిపేట): వరి నారు నాటుకునేటప్పుడు 20–30 సెంటీమీటర్ల కాలిబాటలు వదులు కోవడంతో గాలి, వెలుతురు బాగా సోకుతుందని వ్యవసాయాధికారి షేక్ మహ్మద్ అన్నారు. శుక్రవారం మండలంలోని అర్ధవీడులో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కాలిబాటలతో ఎరువులు, పురుగుమందులు, కలుపుని వారణ మందులు పొలంలో సమానంగా సులభంగా చల్లుకోవడానికి, పొలంలో తిరిగి పైరు పరిస్థితి తెలుసుకోవడానికి, చీడపీడల ఉధృతిని తగ్గించడానికి ఉపయోగపడుతుందన్నారు. సూడోమోనాస్ ఫ్లోరిసెన్స్ జీవ శిలీంద్రనాశిని ఉపయోగించి విత్తన శుద్ధి చేసుకోవడంతో వేర్లు, ఆకులపై వచ్చే బూజు తెగుళ్ల బారినుంచి రక్షణ పొందొచ్చన్నారు. సూడోమోనాస్‌లో రసాయనంలో నారు కట్టలు రెండు గంటలు నానబెట్టి నాట్లు వేయడంతో 20–30 రోజుల వరకు తెగుళ్లను అరికట్టవచ్చునని తెలిపారు. వీఏఏలు మౌనిక, రవికాంత్ పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మహ్మద్

పంట నమోదు చేయించుకోవాలి



పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ



పంట నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ బాలాజీనాయక్

బేస్తవారిపేట: పంట సాగు చేసిన ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డి. బాలాజీనాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొత్తపల్లెలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. పంట సాగు రైతులకు మద్దతు ధర, ఉచిత పంటల బీమా, పంట నష్ట పరిహారం అందాలంటే తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పంట నమోదు చేయించుకుని ఉండాలన్నారు. వ్యవసాయాధికారి జక్కం మెర్సీ, వీఏఏలు పాల్గొన్నారు.

కంభం: మండలంలోని కందులాపురంలో జరుగుతున్న పంట నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం వ్యవసాయాధికారి డి.స్వరూప పరిశీలించారు. మండలంలో ఇప్పటి వరకు రైతులు 1500 ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేసుకున్నారన్నారు. ప్రధానంగా సజ్జ 250 ఎకరాలు, కొర్ర 300 ఎకరాలు, కంది 150 ఎకరాలు, నువ్వులు 200 ఎకరాలు, పత్తి 150 ఎకరాలు ప్రధానంగా సాగు చేసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి రైతు పంట నమోదు చేసుకుంటే ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, బీమాలకు అర్హులవుతారన్నారు. రైతులు తాము వేసుకున్న పంటలను తప్పని సరిగా ఈ–పంటలో నమోదు చేసుకోవాలని కోరారు. ఏఈఓ పాపరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మృతి చెందిన గేదెలకు పోస్టుమార్టం

కొనకనమిట్ల: మండలంలోని గార్లదిన్నె చెరువు వద్ద వేటగాళ్ల అడవి పందుల కోసం వేసిన విద్యుత్ కంచె తగిలి 5 గేదెలు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. గ్రామానికి చెందిన సానికొమ్ము వెలుగొండారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం గొట్లగట్టు పశువైద్యాధికారి వి.రాజ్యలక్ష్మి పశు వైద్య సిబ్బందితో కలిసి ఎస్ఐ మాధవరావు సమక్షంలో మృతి చెందిన గేదెలకు పోస్టుమార్టం నిర్వహించారు. విద్యుత్‌శాఖ అధికారులకు నివేదిక అందజేస్తామని పశువైద్యాధికారి తెలిపారు. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ.2.50 లక్షలు ఉంటుందని, గేదెలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న తనకు నష్టపరిహారం అందించిఆదుకోవాలనిరైతు వెలుగొండారెడ్డి కోరారు.



గేదెకు పోస్టుమార్టం చేస్తున్న పశువైద్యాధికారి

ఉత్తమ సేవలకు ప్రశంసలు



మంత్రి డోలా నుంచి ప్రశంస పత్రం అందుకుంటున్న హౌసింగ్ ఈఈ దాశరథిశర్మ



ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి



కానిస్టేబుల్ కోటేశ్వరరావు



కొనకనమిట్ల తహసీల్దార్ సురేష్‌ను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



లైన్‌మెన్ కాశిరెడ్డి

మార్కాపురం/పొదిలి/కొనకనమిట్ల: విధి నిర్వహణలో మెరుగైన సేవలు అందించిన మార్కాపురం నియోజకవర్గానికి చెందిన పలువురు అధికారులు, సిబ్బందికి ప్రశంసలు దక్కాయి. స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా ఒంగోలులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో మంత్రి డీబీవీ స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎస్పీ ఏఆర్ దామోదర్ చేతులమీదుగా సేవా అవార్డులు అందుకున్నారు.

- మార్కాపురం హౌసింగ్ ఈఈ వి.దాశరథీశర్మ అవార్డు పొందారు. ఆయనను డీఈలు పవన్‌కుమార్, కదీర్‌బాషా, సురేష్‌బాబు, సిబ్బంది హరిప్రసాద్, వెంకటరావు తదితరులు అభినందించారు.
- పొదిలి సీఐ మల్లికార్జునరావు, ఇన్‌చార్జి ఆర్ఐ కిలారి సుబ్బారావు, వ్యవసాయాధికారి షేక్.జైనులాబ్దిన్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి, ఆర్టీసీ ఇంద్ర బస్సు డ్రైవర్ మల్లికార్జునరావు, కండక్టర్లు జ్యోతి, శ్రీదేవి, ఆర్టీసీ డ్రైవర్ కె.మస్తాన్, మెకానిక్‌లు కె.విజయబాబు, బీవీ రావు, కానిస్టేబుల్ ఎం.కోటేశ్వరరావు అవార్డులు పొందగా ఉన్నతాధికారులతోపాటు తోటి ఉద్యోగులు, పలు సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. దర్శి విద్యుత్ సబ్ డివిజన్‌కు సంబంధించి ఉత్తమ లైన్‌మెన్‌గా కాశిరెడ్డి ఎంపికయ్యారు. విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యనారాయణ చేతులమీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు.
- కొనకనమిట్ల తహసీల్దార్ ఆవుల సురేష్ ప్రశంస పత్రం అందుకున్నారు. ఆయనను శుక్రవారం ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైఎస్సార్‌సీపీ జిల్లా విద్యార్థి విభాగం కన్వీనర్ ఏలూరి సంజీవరెడ్డి, గాడి కోనేటిరెడ్డి, చిరుగూరి కోటేశ్వరరావు, కరుణయ్య తదితరులు సన్మానించారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ట్రాఫిక్ సమస్యపై మాట్లాడుతున్న సీఐ

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సీఐ సురేష్ అన్నారు. గిద్దలూరు అర్బన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శుక్రవారం పట్టణంలోని రాచర్లగేటు సెంటర్, నంద్యాల రోడ్డు, పొట్టిశ్రీరాముల విగ్రహం సెంటర్, గాంధీబొమ్మ సెంటర్, మెయిన్ బజారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై కౌన్సిలింగ్ నిర్వహించారు. రోడ్లపై అడ్డంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ప్రవర్తించడంతో ట్రాఫిక్ సమస్య వస్తుందన్నారు. వాటిని నివారించేందుకు తగు జాగ్రత్తలు సూచనలు వ్యాపారులకు వివరించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

24 గంటలపాటు వైద్యసేవలు బంద్

– కోల్‌కతాలో వైద్యురాలి దారుణ హత్యపై ఐఎంఏ ఆగ్రహం

మార్కాపురం టౌన్: ఈనెల 9వ తేదీన కోల్‌కతా నగరంలోని ఆర్.జి.కార్ ప్రభుత్వ వైద్యశాలలో రాత్రి డ్యూటీలో ఉన్న మహిళా డాక్టర్‌ను పాశవికంగా అత్యాచారం చేసి ఆపై హత్యకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ ఇండియన్ మెడికల్ అసోషియేషన్(ఐఎంఏ) జాతీయ కమిటీ పిలుపు మేరకు శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఐఎంఏ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ, కార్యదర్శి ఫణి ఒక ప్రకటనలో తెలిపారు. 17వ తేదీ శనివారం ఉదయం 7 గంటల నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమాలు 24 గంటలపాటు వైద్యసేవలు(అత్యవసర వైద్యసేవలు మినహా) నిలిపేస్తున్నట్లు ప్రకటించారు. వైద్యులపై దాడులు నానాటికీ ఎక్కువవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టాలు తీసుకురావాలని కోరారు. కోల్‌కతాలో వైద్యురాలి హత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.